సాక్షి
కర్నూలు
సోమవారం, 15, జనవరి, 2024



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఆదివారం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు.



బంగ్లాదేశ్ టూ బెలుం

కొలిమిగుండ్ల: బంగ్లాదేశ్ యువకుడు జీర్కుమార్ తాంచగ్య దేశ వ్యాప్తంగా సైకిల్ పర్యటన చేస్తూ ఆదివారం బెలుం గుహలు చేరుకున్నాడు. అతడిని పలువురు అభినందించారు.



నేడు మల్లన్న కల్యాణోత్సవం

సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం పార్వతీ, పరమేశ్వరుల కల్యాణాన్ని నల్లమల చెంచుల మధ్య వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

IIలో▸

న్యూస్‌రీల్

రూ.6 కోట్లతో డోన్‌లో వెజిటబుల్ కాంప్లెక్స్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు (ఆప్కాబ్) సంయుక్తంగా డోన్ మున్సిపాలిటీకి రూ.6 కోట్లు రుణం మంజూరు చేశాయి. నిధులతో డోన్ మున్సిపాలిటీలో వెజిటబుల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఇటీవలే డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, డీసీసీబీ సీఈవో పి.రామంజనేయులు డోన్ మున్సిపాలిటీకి మొదటి విడత కింద రూ.1.48 కోట్లు చెక్ రూపంలో చెల్లించారు. నిర్మాణం పురోగతిని బట్టి నిధులు విడుదల అవుతాయి. ఇప్పటికే డోన్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. ఇందులో భాగంగా మున్సిపల్ వెజిటబుల్ కాంప్లెక్స్ కూడా నిర్మిస్తుండటం విశేషం. ఈ రుణాన్ని డోన్ మున్సిపాలిటీ తొమ్మిదేళ్లలో చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది.

వెండి పడిగె బహూకరణ



ఈఓ రామకృష్ణకు వెండి పడిగెను అందిస్తున్న దాతలు

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణేశ్వరస్వామికి కర్నూలు నగరం రాజీవ్‌నగర్‌కు చెందిన డాక్టర్ వినోద్ ఆచారి 1.149 కేజీల వెండి పడిగెను బహూకరించారు. అలాగే హైదరాబాద్ నగరానికి చెందిన కె.రామ నరసింహ అన్నదాన వితరణకు రూ.1.5 లక్షల చెక్కును అందజేశారు. దాతలకు శేష వస్త్రాలు అందించినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు.

శ్రీశైలంలో 'స్వచ్ఛతీర్థ'

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో ఆదివారం స్వచ్ఛతీర్థ కార్యక్రమంలో భాగంగా క్షేత్రపరిధిలో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుంది. మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ పెద్దిరాజు ఇతర అధికారులు ఆలయ మాఢవీధులు, క్యూకాంప్లెక్స్ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు మొదలైనవాటిని శుభ్రపరిచారు. వారం రోజుల పాటు క్షేత్ర పరిధిలో స్వచ్ఛతీర్థ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్, ఏఈవో బి.మల్లికార్జునరెడ్డి, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు అయ్యన్న, పారిశుద్ధ్య విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'ప్రధానమంత్రి జన్‌మన్'

- వర్చువల్‌గా చెంచులతో మాట్లాడనున్న ప్రధాని మోదీ

పాణ్యం: ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్టు అధికారి డాక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చెంచు మహిళలతో ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడతారని పేర్కొన్నారు. పాణ్యం మండలం నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో వర్చువల్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేశామన్నారు. చెంచులతో ప్రధాని మాట్లాడే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా, సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పీఓ వెంట ఎంటీఏ జనరల్ మెనేజర్ వెంకటశివప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి లత, ఐటీడీఏ ఈఈ ప్రదీప్, ప్రిన్సిపాల్ మేరీ సలోమీ ఉన్నారు.

స'హృదయం'



రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఇంటికి చేర్చడమే కాదు.. ఆ ఇంట్లోని కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణను కూడా తన బాధ్యతగా తీసుకుంటోంది. ఆరోగ్యశ్రీతో అభయహస్తం అందించడంతో పాటు.. ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలను గ్రామీణ స్థాయికి విస్తరించడం విశేషం. ఇకపోతే.. గుండెజబ్బు మాటెత్తితే పై ప్రాణం పైనే పోతుంది. ఛాతీలో నొప్పి వస్తే.. వందల కిలోమీటర్ల దూరం వెళ్లి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆస్తులను అమ్మి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి గుర్తుకు వస్తేనే సగం చచ్చిపోతారు. ఈ పరిస్థితి గుర్తించిన ప్రభుత్వం.. గుండెపోటు లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని సీహెచ్‌సీకి వెళితే.. రూ.40వేల విలువ చేసే ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచి ప్రాణాలను కాపాడేందుకు శ్రీకారం చుట్టింది. ఎమర్జెన్సీ కార్డియాక్‌కేర్(ఈసీసీ) కార్యక్రమంలో భాగంగా కర్నూలు పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక కాగా.. ఎలాగ్జిమ్ ఇంజెక్షన్‌తో కోలుకున్న గుండెలు ఎన్నో తమ కృతజ్ఞతను చాటుతున్నాయి.

– సాక్షి, కర్నూలు డెస్క్



28.12.23



పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన చాకలి రంగయ్యకు ఛాతీలో నొప్పి రావడంతో కుమారుడు వెంటనే పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అక్కడి డ్యూటీ డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్య పరీక్షల అనంతరం రూ.40వేల విలువైన ఎలాగ్జిమ్ (Tencteplase 40mg) ఇంజెక్షన్ వేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

24.10.23

ఆత్మకూరు పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికునిగా పని చేస్తున్న విజయ్‌కి గుండెనొప్పి రావడంతో స్థానిక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చేతులెత్తేయడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితిని అధ్యయనం చేసి ఎలాగ్జిమ్ ఇంజెక్షన్ వేయడంతో విజయ్ కోలుకున్నారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తరలించారు.

05.12.23

ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన మునిస్వామికి ఛాతీలో విపరీతమైన నొప్పి రావడంతో సమీపంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈసీజీ తీసిన వైద్యులు గుండెలో సమస్య ఉన్నట్లు గుర్తించి కర్నూలుకు వెళ్లాలని సూచించారు. అయితే స్థానికంగానే ప్రభుత్వాసుపత్రిలో విలువైన ఇంజెక్షన్ అందుబాటులో ఉన్న విషయం తెలుసుకొని అక్కడికి తీసుకెళ్లారు. వైద్యులు ఎలాగ్జిమ్ ఇంజెక్షన్ వేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఆ తర్వాత నంద్యాలకు తరలించారు.

మారుతున్న జీవన ప్రమాణాలు చిన్న వయసులోనే గుండెపోటుకు కారణం అవుతున్నాయి. అయితే గుండెపోటు సంభవించిన తొలి గంటలోపే అత్యవసర ప్రాథమిక చికిత్సను అందించడం ద్వారా రోగి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. అనారోగ్యానికి గురైన వెంటనే గుండెపోటు లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఆసుపత్రికి చేర్చడంతో పాటు అవసరమైన ఇంజెక్షన్ అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే వీలుంది. ఆ తర్వాత మెరుగైన వైద్యం అందిస్తే రోగి పూర్తిగా కోలుకుంటారని వైద్యులు చెబుతున్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం గుండె సంబంధిత మరణాలను తగ్గించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా నగరాలకు దూరంగా గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న వాళ్లే గుండెపోటు వచ్చినప్పుడు సరైన చికిత్స అందక మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సీహెచ్‌సీల్లోనూ రూ.40వేల విలువైన ఇంజెక్షన్ అందుబాటులో ఉంచుతోంది.

ఆ 40 నిమిషాలే కీలకం

నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ కారణంగా గుండె సంబంధిత సమస్యలతో మరణాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ఇలాంటి మరణాలు 32 శాతం ఉన్నట్లు తెలుస్తోంది. గుండెపోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కార్డియాలజీ, కార్డియోవాస్క్యులర్ సేవలను మరింత విస్తృతం చేస్తోంది. ఇందులో భాగంగానే మెడికల్ కాలేజీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రుల్లో హృద్రోగ చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చింది. గుండెపోటు సంభవించిన తొలి 40 నిమిషాల సమయం ఎంతో కీలకం. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే రోగిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని వైద్యులు చెబుతున్నారు.

గుండె రోగులకు ప్రభుత్వ భరోసా

- సీహెచ్‌సీలలో అందుబాటులోకి ఆధునిక వైద్యం
- ఉచితంగా రూ.40వేల విలువైన ఎలిగ్జిమ్ ఇంజెక్షన్
- ఇప్పటికే పదుల సంఖ్యలో కోలుకున్న రోగులు
- గోల్డెన్ అవర్ సద్వినియోగంపై అవగాహన
- గుండెపోటు మరణాలను తగ్గించే దిశగా చర్యలు



పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ క్లస్టర్ సెంటర్

ప్రతి సీహెచ్‌సీలో రెండు ఇంజెక్షన్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 18 సీహెచ్‌సీల్లో ఎలాగ్జిమ్ ఇంజెక్షన్లను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. అదేవిధంగా నాలుగు ఏరియా ఆసుపత్రులు, రెండు బోధన ఆసుపత్రుల్లోనూ ఇంజెక్షన్ లభిస్తోంది. ఇవికాకుండా కర్నూలులోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో 70 ఇంజెక్షన్లు నిల్వ ఉన్నాయి. వినియోగం ఆధారంగా ఇక్కడి నుంచి ఇంజెక్షన్లను సరఫరా చేస్తున్నారు. వీటిని నిల్వ చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను కూడా ఆయా ఆసుపత్రుల్లో సిద్ధం చేశారు.

ఈ విషయాలపై ప్రత్యేక దృష్టి

➢ శరీర బరువు, ఆరోగ్య పరిస్థితి ఆధారంగా ఇంజెక్షన్ మోతాదును నిర్ణయిస్తారు.

➢ మూత్రపిండాలు, కాలేయం, గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నట్లయితే వైద్యులకు తెలియజేయాలి.

➢ గర్భవతిగా ఉన్నా, చంటి బిడ్డలకు పాలు ఇస్తున్నా, గర్భం దాల్చేందుకు చికిత్స తీసుకుంటున్నా వైద్యులకు వివరించాలి.

➢ మీకు ఏవైనా మందులు పడకపోయినా, అలర్జీ ఉన్నట్లయితే వైద్యులకు తెలపాలి.



ఎలాగ్జిమ్ ఇంజెక్షన్

విస్తృత అవగాహన

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై గ్రామీణ స్థాయి నుంచి విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఏఎన్‌ఎంలు, ఫ్యామిలీ డాక్టర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో గుండెపోటు లక్షణాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. గుండెపోటుకు గురైన వాళ్లను వెంటనే 108 వాహనంలో సమీపంలోని సీహెచ్‌సీకి తరలిస్తే అక్కడ శిక్షణ పొందిన వైద్యులు అత్యవసర ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఆ తర్వాత రోగిని క్యాథ్ ల్యాబ్స్ ఉన్న జిల్లా ఆసుపత్రులు, లేదా బోధన ఆసుపత్రులకు తరలిస్తారు.

గత మూడేళ్లలో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన గుండె శస్త్రచికిత్సలు

సంవత్సరం	మేజర్	మైనర్	మొత్తం
2021	46	137	183
2022	115	467	582
2023	308	507	815

ప్రభుత్వం ఎన్నో గుండెలను కాపాడుతోంది



కోవెలకుంట్ల సీహెచ్‌సీలో ఐదు నెలల నుంచి ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. రక్తనాళాలు బ్లాక్ అయి గుండెపోటుకు గురైన సమయంలో ఈ ఇంజెక్షన్ వినియోగిస్తాం. వాస్తవానికి ఐసీయూ సెటప్ ఉన్న ఆసుపత్రుల్లో గుండెవ్యాధి నిపుణుల పర్యవేక్షణలో ఇంజెక్షన్లు వేయాలి. అంతవరకు రోగి ప్రాణాలతో ఉండటం కష్టమైన సమయంలో నిష్ణాతులైన వైద్యుల సలహాలు, సూచనలతో సీహెచ్‌సీల్లోనే ఇంజెక్షన్ వేస్తాం. ఈ విషయంలో ప్రభుత్వం ఎన్నో గుండెలను కాపాడుతోంది.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ ఇన్‌చార్జ్, కోవెలకుంట్ల

ప్రభుత్వాసుపత్రుల్లోనూ ఖరీదైన వైద్యం



గుండెపోటు వచ్చిందంటే బతకడం చాలా కష్టం. అయితే ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఖరీదైన వైద్యం అందిస్తోంది. ఎలాగ్జిమ్ ఇంజెక్షన్ గుండెపోటు రోగులకు ఎంతో ఉపయోగకరం. గోల్డెన్ అవర్‌లో ఈ ఇంజెక్షన్ ఇస్తే బ్లడ్ క్లాట్స్‌ను నియంత్రించి రక్త సరఫరాను పునరుద్ధరిస్తుంది.

– డాక్టర్ పి.ప్రశాంత్, ఈసీసీ నోడల్ అధికారి

ఈసీజీ రిపోర్టు ఆధారంగా చికిత్స



పత్తికొండ ఆసుపత్రిలో ఉన్న ఈసీజీ మిషన్, ప్రత్యేక సెల్‌ఫోన్

గుండెపోటుకు గురైన వెంటనే గోల్డెన్ అవర్‌లో వచ్చిన రోగికి ఈసీజీ తీస్తారు. ఆ రిపోర్టు ఆధారంగా చికిత్సను అందిస్తారు. అయితే సీహెచ్‌సీలో గుండె సంబంధ వైద్యులు ఉండనందున ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సైతం చేపట్టింది. ప్రతి సీహెచ్‌సీలో గుండె రోగులకు అవసరమైన ఎలాగ్జిమ్ ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచడంతో పాటు ఈసీజీ మిషన్, ఈ రిపోర్టును నిష్ణాతులైన వైద్యులకు పంపేందుకు ప్రత్యేక సెల్‌ఫోన్‌ను అందుబాటులో ఉంచింది. ఈసీజీ తీసిన వెంటనే ఆ రిపోర్టును గుండె సంబంధ వైద్యులకు పంపితే వారు సూచన మేరకు అత్యవసర చికిత్స అందించనున్నారు.



కర్నూలులో భోగి మంట వేసిన దృశ్యం

ఆదివారం తెల్లవారుజామునే భోగి మంటలతో లోగిళ్లు వెలుగులీనాయి. రంగు రంగుల ముగ్గులతో ఇంటింటా ఆనందాలు వెల్లివిరిశాయి. సొంతూరిపై మమకారంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు బంధుమిత్రులతో ఉల్లాసంగా గడిపారు. ఆత్మీయ పలకరింపులతో సంతోషాన్ని పంచుకున్నారు. గంగిరెద్దుల ఆటలు, సన్నాయి మేళాలతో ఊరూవాడా సందడి కనిపించింది. సంక్రాంతి పండుగ ప్రతి ఇంటికీ సంబరాన్ని తీసుకొచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

చూసిన కనులదే భాగ్యం

- కమనీయంగా ఆండాల్ అమ్మవారి తిరుక్కల్యాణోత్సవం
- అహోబిలంలో శాస్త్రోక్తంగా ముగిసిన ధనుర్మాస పూజలు





ఉత్సవంలో పాల్గొన్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో గోదాదేవి, ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: జయజయ నారసింహ నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. వేద పండితులు వేదోక్త మంత్రాలు పఠిస్తుండగా.. ఆస్థాన విద్వాంసుల మంగళకరమైన వాయిద్యాల నడుమ శ్రీ అహోబిల లక్ష్మీనరసింహుడు, గోదాదేవి పరిణయ వేడుక ఆదివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో వైభవంగా జరిగింది. దీంతో నెలరోజులుగా జరుగుతున్న ధనుర్మాస పూజలు ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా వేకువ జామునే దిగువ అహోబిలంలో కొలువైన మూలవిరాట్ శాంతమూర్తి శ్రీ ప్రహ్లాదవరదడు, అమృతవల్లీ అమ్మవార్లతో పాటు గోదాదేవి అమ్మవార్లను సుప్రభాతసేవతో మేలుకొలిపి ప్రత్యేక ధనుర్మాస, భోగి పూజలు నిర్వహించారు. అనంతరం గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవ మూర్తులను కొలువుంచారు. ఆతర్వాత నవకలశస్థాపన, అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆండాల్ అమ్మవారి సన్నిధికి చేర్చి శ్రీ గోదాదేవి, ప్రహ్లాదవరదుల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవారిని, గోదాదేవిని పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం జరిపారు.

బ్రహ్మోత్సవం.. శోభాయమానం

- శ్రీగిరిలో వైభవోపేతంగా సంక్రాంతి ఉత్సవాలు
- రావణవాహనంపై విహరించిన ఆదిదంపతులు
- నేడు నందివాహనసేవ



రావణ వాహనంపై కొలువుదీరి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఆదిదంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సకల భోగ సౌభాగ్యాలనిచ్చే భోగి పర్వదినమైన ఆదివారం పార్వతీ సమేత మల్లికార్జున స్వామి రావణవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలతో అలంకార మండపం వద్దకు తోడ్కొనివచ్చి రావణవాహనంపై ఆశీనులను చేశారు. రావణ వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక వాహన పూజలను జరిపారు. అనంతరం రావణ వాహనంపై ఆశీనులైన ఆదిదంపతులను ఆలయ ప్రదక్షిణ చేయించి క్షేత్రపుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రావణవాహనంలో ఆశీనులైన స్వామిఅమ్మవార్లను దర్శించడం వలన భక్తిభావాలు పెంపొందుతాయి. శివకటాక్షం లభిస్తుంది. రావణవాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ ఏఈవో మోహన్, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ సంపాదకులు అనిల్‌కుమార్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

- ఆదివారం వేకువజామున శ్రీశైల దేవస్థానం సంక్రాంతి సందర్భంగా భోగిమంటలు కార్యక్రమాన్ని నిర్వహించింది. స్వామిఅమ్మవార్లకు ప్రాతఃకాలపూజలు, మహామంగళహారతులు పూర్తయిన తరువాత ప్రధాన ఆలయ మహాద్వార ఎదురుగా గంగాధర మండపం వద్ద భోగి మంటలు వేశారు. అలాగే సామూహిక భోగిపండ్ల కార్యక్రమాన్ని చేపట్టారు. ఐదేళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు భోగి పండ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు నంది వాహనసేవ

సంక్రాంతి రోజు సోమవారం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులు నందివాహనసేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను నందివాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పార్వతీ, పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలోని స్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణ మండపంలో గంగాపార్వతీ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, వాహనంతో సెబ్ సీఐ జయరాంనాయుడు , సిబ్బంది

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో వివరాలు వెల్లడించారు. మంత్రాలయం మండలం సుగూరు–బూదరు క్రాస్ దగ్గర తనిఖీలు చేస్తూ టవేరా వాహనాన్ని ఆపామన్నారు. పోలీసులను చూసి వాహనం వదలి డ్రైవర్ పరార్ అయ్యాడన్నారు. వాహనంలో 28 బాక్సుల్లో 2,688 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు ఉన్నాయన్నారు. వాటితోపాటు టవేరా వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని చెప్పారు. తనిఖీల్లో సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీ గోపాల్, లింగ ప్రసాద్, రబ్బానీ, పీసీలు రామచంద్రుడు, నరసింహారెడ్డి, ఇందుమతి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో హాస్టల్ విద్యార్థిని ప్రతిభ



రజత పతకం సాధించిన వీణతో హెచ్‌డబ్ల్యూఓ బెన్నమ్మ

కర్నూలు(అర్బన్): వైఎస్సార్ జిల్లా రాజంపేటలో ఈ నెల 12, 13వ తేదీల్లో జరిగిన శ్రీ పసుపులేటి బ్రహ్మయ్య మెమోరియల్ 45వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ పోటీల్లో నగరంలోని ఎస్సీ నంబర్:1 బాలికల వసతి గృహం విద్యార్థిని బీ వీణాకుమారి రజత పతకాన్ని సాధించింది. రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచి కర్నూలు జట్టును మూడవ స్థానంలో నిలిపిందని వసతి గృహ సంక్షేమాధికారిణి బీ బెన్నమ్మ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం విద్యార్థిని వీణను అభినందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి సాంఘిక సంక్షేమ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించేందుకు వీణకు తమ సహాయ సహకారాలను అందిస్తామన్నారు.



బండిఆత్మకూరులో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



శ్రీశైలంలో కోలాటం వేస్తున్న మహిళలు



నంద్యాలలో గోదాదేవి, రంగనాథస్వామికి గ్రామోత్సవం



నంద్యాలలో హరిదాసుకు నమస్కరిస్తున్న మహిళ

ఇంటింటా సంక్రాంతి శోభ

- రంగవల్లులు, గొబ్బెమ్మలతో కళకళలాడుతున్న లోగిళ్లు
- అర్హులందరికీ అందుతున్న సంక్షేమ పథకాలు
- పల్లెలు, పట్టణాల్లో అంబరాన్నంటిన సంబరాలు



శ్రీశైల ఆలయంలో పుష్పాలతో అలంకరణ



కర్నూలులోని నిర్మల్ నగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



కర్నూలు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీలో భోగి మంట

కర్నూలు(అగ్రికల్చర్): పల్లెలకు, పట్టణాలకు సంక్రాంతి శోభ వచ్చింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందజేశారు. పలుచోట్ల ఎద్దుల పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని కనుల పండువగా జరుపుకోనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు బాసటగా నిలుస్తోంది. వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, వైఎస్సార్ నేతన్న నేస్తం, కాపు నేస్తం, జగనన్న తోడు, గోరుముద్ద, వాహనమిత్ర.. ఇలా అనేక రకాల పథకాలతో ప్రజలకు అండగా నిలిచింది. ఎవరి సిఫార్సు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోంది. వ్యవసాయాన్ని పండుగ చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారు. దీంతో పలెల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. రైతులు ఆనందోత్సవాలతో సంక్రాంతి పర్వదినాన్ని జరుపుకుంటున్నారు.

- ➡ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జనవరిలో పింఛన్ మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000 పెంచి అవ్వాతాతల్లో ఆనందాన్ని నింపింది. వైఎస్సార్ పింఛన్ కానుక కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనవరి నెలలో 4.72 లక్షల మంది రూ.135 కోట్లు పంపిణీ చేసేసింది.
- ➡ 2023–24 సంవత్సరానికి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్‌ఆర్ రైతు భరోసా చివరి విడత మినహా అన్ని సంక్షేమ పథకాలు అమలు అయ్యాయి.
- ➡ ఇంటివద్దకే రేషన్, వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ, జగనన్న ఆరోగ్య సురక్ష, ఇంటి వద్దనే పెన్షన్‌ల పంపిణీ తదితర కార్యక్రమాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు వెదజల్లుతున్నాయి.
- ➡ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎపుడూ లేని విధంగా 2022–23 నుంచి మిర్చి సాగు అవుతోంది. 2022–23లో 1.75 లక్షల ఎకరాల్లో సాగు కాగా... 2023–24లో రికార్డు స్థాయిలో 2 లక్షల ఎకరాలకు పైగా సాగు కావడం విశేషం. కర్నూలు, ఆదోని, నంద్యాల మార్కెట్‌ల్లో మిర్చికి ధరలు ఆశాజనకంగా ఉంటున్నాయి.
- ➡ అన్నదాతలను ఉద్యాన పంటలు ఆదుకుంటున్నాయి. ఈ సారి మామిడిలో పూత, పిందె ఆశాజనకంగా రావడం రైతులకు ఊరట కలిగించే విషయం.
- ➡ ఉద్యోగ, ఉపాధి, వ్యాపార నిమిత్తం సుదూర ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వచ్చారు. కుటుంబ సభ్యులు, పాత మిత్రులతో కలసి ఆనందోత్సవాల మధ్య పండుగ జరుపుకుంటున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత పుట్టిన గడ్డ మీద మట్టిన వాసన పీల్చి సంతోషాలను పంచుకుంటున్నారు.



కర్నూలులో ముగ్గులు వేస్తున్న మహిళలు



గూడూరులో ముగ్గులో ఒదిగిన బాపూ బొమ్మ



నంద్యాలలో సీతారామ లక్ష్మణుల వేషధారణలో చిన్నారులు



పగిడ్యాలలో పొట్టేళ్ల పోటీ



జూపాడుబంగ్లా మండలం తరిగోపులలో ఎద్దుల పోటీలు

నేడు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం

- నల్లమల చెంచులు పెళ్లి అతిథులు
- ఈత ఆకులు పెళ్లి ఆభరణాలు.. వెదురు బియ్యం తలంబ్రాలు
- ఆనవాయితీగా కొనసాగుతున్న ఆచారం

శ్రీశైలంటెంపుల్: సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీశైలంలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వివాహోత్సవానికి ప్రత్యేక ఉంది. ఈ పెళ్లికి నల్లమల చెంచులు ప్రత్యేక అతిథులు. భ్రమరాంబాదేవిని వారు కూతురుగా, మల్లికార్జున స్వామిని తమ ఇంటి అల్లుడిగా భావిస్తారు. నల్లమల అడవులను కాపాడుకుంటూ..అటవీఫలాలపై ఆధారపడి జీవిస్తున్న చెంచులు స్వామిఅమ్మవార్ల కల్యాణానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఆనవాయితీగా కొనసాగుతున్న ఆచారం మేరకు చెంచులు మల్లన్న కల్యాణానికి సర్వం సిద్ధం చేసుకున్నారు. స్థానిక మేకలబండ చెంచు గూడేంలో నివసిస్తున్న మండ్లి మల్లికార్జున (దేవ చెంచు) స్వామి అమ్మవార్ల కల్యాణానికి అడవి ఆకులతో ఆభరణాలు సిద్ధం చేశారు. ఈత ఆకులతో అమ్మవారికి, మెట్టెలు, గాజులు, మెడలో ధరించేందుకు ఆభరణాలు, బాసికాలు తయారు చేశారు. అలాగే స్వామివారికి జంజం, మెడలో ధరించేందుకు ఆభరణం, ఉంగరం, తలంబ్రాలుగా వెదురు బియ్యం ఇలా కల్యాణానికి అవసరమైన సమాగ్రిని ప్రత్యేకంగా సిద్ధం చేశారు. స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవానికి చెంచులను ప్రత్యేకంగా దేవస్థానం ఆహ్వానించింది. శ్రీశైలం ఐటీడీఏ అధికారుల సహకారంతో చెంచు భక్తులు కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవానికి విచ్చేసే చెంచు భక్తులకు దేవస్థానం తరుపున పురుషులకు పంచ, కండువా, మహిళలకు చీర, రవిక అందజేయనున్నారు.

ఘనంగా ఉర్దూ పాఠశాల శతాబ్ది ఉత్సవాలు



శతాబ్ది ఉత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు సిటీ: పాతబస్తీలోని గడియారం హాస్పిటల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో శతాబ్ది ఉత్సవాలను ఆ స్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హనీఫ్ హుస్సేన్, కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. అన్ని వృత్తులకంటే ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఉర్దూతోపాటు ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశాపెట్టారన్నారు. ఈ స్కూల్‌లో తన తండ్రి మొయిజ్‌ఖాన్‌తో పాటు తమ కుటుంబ సభ్యులందరూ ఇక్కడే చదువుకున్నారన్నారు. తన వంతుగా పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. పూర్వ విద్యార్థులు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సబిహా పర్వీన్, కార్యనిర్వాహకులు ఎజాద్‌హుస్సేన్, ఫరూక్, అబ్దుల్ ఖాదీర్, అజస్, ఆర్.కే ఖాజా వుద్దీన్, సాదక్ బాషా, షర్మజ్, నూరుల్లాఖాద్రీ, లతీఫ్‌వుద్దీన్, నూరూల్ అమీన్, నూర్ ఆహ్మద్, రూటా జిల్లా అధ్యక్షులు మోయిన్ బాషా పాల్గొన్నారు.

సామాజిక సేవలు కొనసాగించాలి

- బాల సాయి జయంతి వేడుకల్లో నగర మేయర్ బీవై రామయ్య



దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: భగవాన్ బాల సాయి బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉండాలని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. భగవాన్ శ్రీ బాలసాయి బాబా జయంతి వేడుకలు, ప్రపంచ శాంతి సదస్సు, బాలసాయి దీన జన సేవా కార్యక్రమాలు ఆదివారం ఓల్డ్ సిటీలోని బాలసాయి బాబా మందిరంలో ఘనంగా జరిగాయి. నగర మేయర్‌తో పాటు మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవా గుణం కలిగి ఉండాలన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని కులమతాలకు అతీతంగా సేవలు అందించిన మహోన్నత వ్యక్తి భగవాన్ బాలసాయి బాబా అన్నారు. ఆయన ఉంటే మరిన్ని సేవా కార్యక్రమాలు తీసుకొచ్చేవారన్నారు. బాల సాయి లేకపోయినా వారి ఆశయాలు, సేవా కార్యక్రమాలు ట్రస్ట్ సభ్యులు కొనసాగించడం అభినందనీయమన్నారు. టీజీ మాట్లాడుతూ నిస్వార్థ సేవ చేసే వారు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలోని నిరుపేదలకు ప్రతి సంవత్సరం కుట్టుమిషన్లు, గ్రైండర్లు, టీ స్టాల్ బండ్లు, ట్రై సైకిల్స్‌ను అందించడం ప్రశంసనీయమన్నారు. అంతముందు బాల సాయి ప్రార్థనా మందిరంలోని బాలసాయి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. బాల సాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామారావు మాట్లాడుతూ బాలసాయి ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తర్వాత మెడికల్ క్యాంప్ నిర్వహించి పేదలకు కుట్టు మిషన్లు, పండ్లు, పూలు, కూరగాయల బండ్లు, గ్రైండర్లు, టీ స్టాల్ బండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి అలరించాయి. బాలసాయి బాబా ట్రస్ట్ ట్రస్టీ ఉషాశ్రీ, మాజీ ఎమ్మెల్యే మదనగోపాల్, బజరంగ్ దళ్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతూ కుప్పకూలి..



మృతి చెందిన రామస్వామి (ఫైల్)

నందికొట్కూరు రూరల్: నాగటూరు గ్రామంలో ఓ వ్యక్తి క్రికెట్ ఆడుతూ ఆకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందాడు. గ్రామానికి చెందిన రైతు మచ్చా రామస్వామి (30) ఆదివారం ఉదయం సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామంలో స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. ఆట మధ్యలో ఛాతిలో నొప్పి వచ్చింది. వెంటనే అతని స్నేహితులు హుటాహుటిన నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతరు ఉన్నారు.

ఆరాధ్యుడు.. శ్రీరామలింగేశ్వరుడు

- రేపు రాంపురంలో మహారథోత్సవం
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు



రాంపురంలోని రామలింగేశ్వర స్వామి



రథయాత్రకు సిద్ధం చేస్తున్న మహారథం

మంత్రాలయం: ఆరాధ్యులకు అభయ మొసగే మూర్తి.. కొలిచే వారి కల్పతరువు శ్రీ రామలింగేశ్వరుడు. మంత్రాలయం మండలం రాంపురం గ్రామం పవిత్ర తుంగభద్ర నది ఒడ్డున వెలిశాడు. అలనాడు శ్రీరాముడు అరణ్యవాసం చేస్తూ తుంగానది తీరంలో పర్యటించారని, ప్రాతఃకాల పూజ నిమిత్తం సైకతంతో లింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారని, శ్రీరాముడుచే ప్రతిష్ఠించబడటంతో రామలింగేశ్వరుడుగా అవతరించారని స్థల పురాణం చెబుతోంది. ఏటా సంక్రాంతి పర్వదినం తర్వాత కనుమ రోజున రామలింగేశ్వరుడి జాతర, మహారథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. రాంపురం సోదరులు టీటీడీ పాలకమండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా వేడుకను జరపనున్నారు.

ఉత్సవ విశేషాలు..

శ్రీరామలింగేశ్వరుడి ఉత్సవాలు మంగళవారం వరకు నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం కల్యాణోత్సవం, మంగళవారం రాత్రి మహారథోత్సవం జరగనుంది. జాతర సందర్భంగా గ్రామంలో యువకులు కోలాటాలు, క్రీడాపోటీలు, భజనలు నిర్వహిస్తారు. జాతర మహోత్సవానికి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. రాంపురం సోదరులు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, గుంతకల్ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

అందరూ ఆహ్వానితులే

శ్రీరామలింగేశ్వరస్వామి మా ఊరి దైవం. జాతరకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నాం. రథయాత్రను పురస్కరించుకుని ఆలయానికి రంగులద్ది విద్యుద్దీపాలంకరణ చేశాం. ఉత్సవానికి అందరూ ఆహ్వానితులే.

– వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే